క్షయ వ్యాధిపై అవగాహన


క్షయ అవగాహన ర్యాలీలో పాల్గొన్న జేసీ డాక్టర్ బి.నవ్య తదితరులు


వైద్య విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలావెంకటశేషాద్రి, అధికారులు


మెడికవర్ హాస్పిటల్‌లో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సువర్ణ లక్ష్మి

కర్నూలు(హాస్పిటల్): క్షయ వ్యాధిపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య చెప్పారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్ వద్ద ర్యాలీని వారు ప్రారంభించారు. ర్యాలీ కర్నూలు మెడికల్ కాలేజీ మీదుగా ఆసుపత్రి ప్రాంగణంలోని పాత లెక్చర్ గ్యాలరీ వరకు కొనసాగింది. న్యాయమూర్తి లీలా వెంకటశేషాద్రి మాట్లాడుతూ సమాజంలో వేగంగా వ్యాప్తి చెందే క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి. శాంతికళ మాట్లాడుతూ.. క్షయ బాధితులు క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు. మధ్యలో మందులు మానేస్తే తిరిగి వ్యాధి విజృంభించే అవకాశం ఉంటుందని వివరించారు. క్షయ వ్యాధిపై క్విజ్, వ్యాస రచన పోటీల్లో ప్రతిభ చాటిన ఎంబీబీఎస్(యూజీ) కోర్సు విద్యార్థులకు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి బహుమతులు ప్రదానం చేశారు. డాట్ విధానం ద్వారా క్షయ రోగులకు మందులు అందించిన గ్రామపంచాయతీ సర్పంచ్‌లకు ప్రత్యేక బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా క్షయ, లెప్రసీ, ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్, జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్, సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి. వెంకటేశ్వర్లు, డాక్టర్ మోక్షేశ్వరుడు, డాక్టర్ సి.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ ఏఎస్.శ్రీకాంత్ విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు(హాస్పిటల్): టీబీని ఓడించి దేశాన్ని గెలిపించాలని కర్నూలు మెడికల్ కాలేజీ కమ్యూనిటీ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ పిలుపునిచ్చారు. వరల్డ్ టీబీ డేను పురస్కరించుకుని కర్నూలు మెడికల్ కాలేజీ ఎస్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్థానిక శ్రీరామనగర్‌లోని అర్బన్‌హెల్త్ సెంటర్‌లో ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. అర్బన్‌హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దివ్య, డాక్టర్ యు.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

➤క్షయ వ్యాధి కొన్నిసార్లు ప్రాణాంతకం కావచ్చని పల్మనాలజిస్టు డాక్టర్ వినోద్ ఆచారి, డాక్టర్ సువర్ణలక్ష్మి కల్లి చెప్పారు. సోమవారం స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

సమస్యలపై ఫిర్యాదుల వెల్లువ

- తాగునీరు, రహదారులు, మురుగు కాల్వలపై స్థానికుల ఫిర్యాదు
- పీజీఆర్‌ఎస్‌లో కమిషనర్‌కు వినతి


కమిషనర్ రవీంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న నగర ప్రజలు

కర్నూలు (టౌన్): స్థానిక చంద్రమౌళి నగర్‌లో తాగునీరు, రహదారులు, మురుగు కాల్వల సమస్యలు పరిష్కరించాలని స్థానికులు బాలశౌరి, రఘురామయ్య, వంశీ విన్నవించారు. ఇదే సమస్యను పరిష్కరించాలని శ్రీనివాసనగర్‌కు చెందిన నరసింహబాబు, హనీఫ్, రఘు వినతిపత్రం ఇచ్చారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ రవీంద్రబాబు పాల్గొని వివిధ కాలనీల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. త్వరితగతిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మీ, ఎంఈ సత్యనారాయణ, సూపరింటెండెంట్ వాజిద్, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

➤పందిపాడు ఇందిరమ్మ గృహాల్లో మోటార్లకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు రాజు, ధర్మ, అన్వర్ విన్నవించారు.

➤20వ వార్డు కరీంనగర్, సనత్ నగర్ కాలనీలలో మురుగు కాల్వలు నిర్మించాలని స్థానికులు రాజు, ప్రభావతి కోరారు.

➤మారుతి మెగా సిటీ కాలనీలో అధ్వానంగా ఉన్న బీటీ రహదారిని బాగు చేయాలని స్థానికులు జయపాల్ రెడ్డి, దామోదర్ రెడ్డి, రామక్రిష్ణా రెడ్డి విన్నవించారు.

➤రిచ్మండ్ అవెన్యూ కాలనీలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కాలనీవాసుల అసోసియేషన్ నాయకులు వెంకటరాముడు, పవన్ కుమార్, రఘునాథ్, కోటేశ్వరరావు కోరారు.

➤బాలాజీనగర్‌లో వాటర్ ట్యాంకును నింపాలని అదే కాలనీకి చెందిన డెవలప్‌మెంట్ సొసైటీ ప్రతినిధులు ప్రతాప్ రెడ్డి, వెంకట సుబ్బయ్య విన్నవించారు.

➤డెక్కన్ బిర్యానీ వద్ద రహదారి కన్నా కల్వర్టు ఎత్తు తక్కువ ఉండటం కారణంగా మురుగు నీరు తమ ఇళ్లలోకి వస్తున్నాయని ఆదిత్య నగర్ వాసులు షఫీ, రాఘవ రెడ్డి, భాగ్యలక్ష్మి ఫిర్యాదు చేశారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం నామినేషన్లు


ఎన్నికల అధికారులకు నామినేషన్లు అందజేస్తున్న దృశ్యం

కర్నూలు (సెంట్రల్): కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ పదవులకు పోటాపోటీగా నామినేషన్లు దాఖలయ్యాయి. బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవి కోసం బి.మురళి మనోహర్, ఆర్‌ఎం సంపత్‌కుమార్, పి.హరినాథ్ చౌదరి, ఉపాధ్యక్ష పదవికి ఎం.త్రివిక్రం, ప్రధాన కార్యదర్శి పదవికి ఎం.ఆంజనేయులు, వి.కృష్ణమూర్తి, ఎం.వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ పదవికి ఎం.బాలసుబ్రహ్మణ్యం, టీకే నాగరాజు, కోశాధికారి పదవికి ఎం.గౌతమ్, లైబ్రరీ సెక్రటరీకి పి.చంద్రశేఖర్, ఎస్‌ఎం సఫత్, క్రీడా కార్యదర్శి బెస్త సుధాకర్, మహిళా ప్రతినిధి పదవికి హెచ్‌కే అరుణ తమ నామినేషన్లను ఎన్నికల అధికారులు జి.విజయ్‌కుమార్, కె.మోహన్ బాబు, కె.రంగనాథ్, సి.ప్రభాకర్‌రెడ్డిల వద్ద దాఖలు చేశారు. మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ తర్వాత పోటీలో ఉన్న పదవులకు ఈనెల 27వ తేదీ ఉదయం నుంచి పోలింగ్ నిర్వహించడం సాయంత్రం ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెంటనే ప్రకటిస్తామని ఎన్నికల అధికారులు తెలిపారు.

30 నుంచి శ్రీదేవి వసంత నవరాత్రి పూజలు

కర్నూలు కల్చరల్: కర్నూలు శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో ఈనెల 30 నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు మహా గౌరీ అమ్మవారికి శ్రీదేవి వసంత నవరాత్రి పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టీ సభ్యులు తెలిపారు. వసంత రుతువు ప్రారంభ నేపథ్యంలో ఉగాది నుంచి శ్రీరామ నవమి వరకు అమ్మవారికి అర్చనలు, ఉపాసనలు, సహస్రనామాచర్చన, నవ చండీ సప్తశతి పారాయణం, చివరి రోజు చండీ హోమం జరుగుతుందని పేర్కొన్నారు.

మాతృభాషతోనే సంస్కృతి పునరుజ్జీవం

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ విద్యలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలపై అధ్యాపకులు ఆందోళన చెందుతున్నారు. ద్వితీయ భాషగా ఉన్న తెలుగు సబ్జెక్టును ఐచ్ఛిక సబ్జెక్టుగా చేసిన మార్పులను వెంటనే నిలిపి వేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ తెలుగు అధ్యాపకులు సోమవారం ఇంటర్ స్పాట్ క్యాంపు నుంచి రాజ్‌విహార్ మీదుగా ర్యాలీగా కలెక్టరేట్ వరకు వచ్చి నిరసన తెలిపారు. తెలుగు అధ్యాపకులు మాట్లాడుతూ.. మాతృభాషతోనే విద్యార్థి సమగ్ర వికాసానికి బాటలు వేసేందుకు సాధ్యమని అన్నారు. ప్రభుత్వ తీసుకున్న నిర్ణయాల వలన తెలుగు బాష మనుగడే ప్రశ్నార్ధకంగా మారుతుందన్నారు. ఇంగ్లిష్ సబ్జెక్టును కచ్చితం చేసి, తెలుగును ఐచ్ఛికం చేయడమంటే తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు.

పోక్సో కేసుల విచారణకు ప్రత్యేక కోర్టు

కోడుమూరు రూరల్: పోక్సో కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసినట్లు మొదటి అదనపు జిల్లా జడ్జి భూపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం కోడుమూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో పొదుపు, అంగన్‌వాడీ మహిళలు, మహిళా పోలీసులకు పోక్సో యాక్ట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా జడ్జి భూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. లైంగిక నేరాల నుంచి రక్షణ చట్టం -2012 ప్రకారం పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవన్నారు. 18 సంవత్సరాల్లోపు వయస్సు గల పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడకుండా పోక్సో యాక్ట్ ఉపయోగపడుతుందన్నారు. ట్రైనీ జ్యూడిషియల్ ఆఫీసర్లు ఈశ్వర వెంకటప్రసాద్, లీలాసాయి సుభాష్, హేమ, అర్చన, శ్రీవల్లి, సర్పంచు భాగ్యరత్న, ఎంపీడీఓ రాముడు, డీటీ రామాంజనేయులు, సీడీపీఓ శారద, ఏపీఎంలు సుబ్బయ్య, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్ల పంపిణీ


ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లను అందిస్తున్న జేసీ డాక్టర్ బి.నవ్య, అధికారులు

కర్నూలు(సెంట్రల్): విభిన్న ప్రతిభావంతులకు 13 ల్యాప్‌టాప్‌లు, 12 సెల్‌ఫోన్లను జేసీ డాక్టర్ బి.నవ్య అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఆమె అర్హులకు వాటిని అందించి ఉన్నత విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. డిగ్రీ, పాలిటెక్నిక్ తదితర ప్రొఫెషనల్ కోర్సులు చేస్తున్న 13 మందికి ల్యాప్‌టాప్‌లు, ఇంటర్ పూర్తి చేసిన 12మందికి సెల్‌ఫోన్లకు ఎంపిక చేసినట్లు చెప్పారు. ఒక్కో ల్యాప్‌టాప్ విలువ సుమారు రూ.58 వేలు ఉందని చెప్పారు. డీఆర్వో వెంకటనారాయణమ్మ, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ రయీస్ ఫాతిమా పాల్గొన్నారు.

పేదలకు సాయం చేయాలి


రంజాన్ తోఫాను అందిస్తున్న బాలు నాయక్

కర్నూలు(సెంట్రల్): ప్రతి ఒక్కరూ పేదలకు సాయం చేయాలని కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ బాలు నాయక్ సూచించారు. సోమవారం 48వ వార్డు రోజా వీధిలోని పేద ముస్లింలకు విశాఖపట్నం ఆర్‌డీఓ హుస్సేన్ సాహెబ్ భార్య హుస్సేనమ్మ, చిన్న కూతూరు షబానా, ఆమె భర్త యాసిన్, కుమారుడు అయ్యాన్ రంజాన్ తోఫాను అందించారు. బాలునాయక్ మాట్లాడుతూ.. పేద ముస్లింలు రంజాన్ పండుగను జరుపుకోవడానికి దాతలు సాయం అందజేయాలన్నారు. ఉప కమిషనర్ వెంకటేశ్వర్లు, రోజా మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత పాల్గొన్నారు.

29న సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు జిల్లా ప్రభుత్వ 4వ తరగతి ఉద్యోగుల సహకార గృహ నిర్మాణ సంఘం సర్వసభ్య సమావేశం ఈ నెల 29న జరుగుతుందని అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ చైర్మన్ టి.నాగరమణయ్య తెలిపారు. ఏపీ సహకార సంఘాల చట్టం ప్రకారం మార్చిలోపు ఈ సమావేశం జరుగాల్సి ఉన్నందున 29వ తేదీన నిర్వహిస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సమావేశం సి.క్యాంపు సెంటర్‌లోని ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం భవనంలో ఉదయం 11 గంటలకు జరుగుతుందని, సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

కర్ణాటక భక్తులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

కర్నూలు(అగ్రికల్చర్): శ్రీశైలం క్షేత్రానికి కాలినడకన వెళ్తున్న కర్ణాటక భక్తుల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టింది. వెంకాయపల్లి ఎల్లమ్మ గుడి వద్ద సోమవారం ఉదయం నుంచి రోజంతా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. వెయ్యి మందికి పైగా కర్ణాటక భక్తులకు అన్నదానం చేసినట్లు సంఘం కర్నూలు శాఖ అధ్యక్షుడు రంగారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం మంగళవారం కూడ జరుగుతుందని ఆయన వెల్లడించారు.

జాతీయ పోటీల్లో సత్తా చాటాలి


క్రీడాదుస్తులు పంపిణీ చేసిన అసోసియేషన్ నాయకులు

కర్నూలు (టౌన్): ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు బీహార్ రాష్ట్రంలోని జహీరాబాదులో నిర్వహించే 46వ జాతీయ స్థాయి జూనియర్ బాలుర అండర్-19 హ్యాండ్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు ప్రతిభ చాటాలని హ్యాండ్ బాల్ సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో జాతీయ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టు క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ పోటీలను అవకాశంగా మలచుకొని సత్తా చాటాలన్నారు.

ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులపై దాడి దారుణం

- కఠిన చర్యలు తీసుకోవాలని జేసీకి వినతి


కోడుమూరు ఎస్సీ హాస్టల్‌లో జరిగిన ఘటనపై సెల్‌ఫోన్‌లో వచ్చిన దృశ్యాలను జేసీ నవ్యకు చూపిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కోడుమూరు ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులపై దాడి చాలా దారుణమని, దాడికి పాల్పడిన పదో తరగతి విద్యార్థి మహేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని జేసీ డాక్టర్ బి.నవ్యకు పలు విద్యార్థి సంఘాల నాయకులు వినతిపత్రాలు అందజేశారు. సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని సునయ ఆడిటోరియంలో జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, ఇతర ఉన్నతాధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కోడుమూరు ఎస్సీ హాస్టల్‌లో జరిగిన ఘటనపై విచారణ జరపాలని ఎస్ఎఫ్ఐ, ఏఐవైఎఫ్, పీడీఎస్‌యూ నాయకులు అబుబకర్, ఖాజావలి, శ్రీరాములు, కె.భాస్కర్ వినతిపత్రాలు ఇచ్చారు. అలాగే బీపీ స్టూడెంట్, బహుజన విద్యార్థి వేదిక నాయకులు పగడాల ఆనంద్‌బాబు, బీవీ రమణ వినతిపత్రాలు ఇచ్చారు. ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా హాస్టల్ వార్డెన్, ఇతర సిబ్బంది ఏమి చేస్తున్నారని, విద్యార్థులకు రక్షణ లేదా అని వినతిపత్రాల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గోపి హోటల్‌లో అగ్నిప్రమాదం


హోటల్‌లో నుంచి ఎగిసి పడుతున్న మంటలు


మంటలు ఆర్పుతున్న ఫైరింజన్

కర్నూలు సిటీ: నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న గోపి హోటల్‌లో సోమవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. 12.30 సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. రోడ్డుపై వెళ్తున్న వారు గుర్తించి హోటల్‌లో నిద్రిస్తున్న వారిని అప్రమత్తం చేయడంతో వారు వెంటనే హోటల్ గేట్లు తెరుచుకొని బయటికి వచ్చారు. సమాచారం అందుకున్న నాలుగో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని హోటల్‌లో ఉన్న గ్యాస్ సిలిండర్లను బయటకు తీసుకు రావడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారమివ్వడంతో వారు అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

అమర వీరులకు నివాళి


అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు, డీవైఎఫ్ఐ నాయకులు

కర్నూలు(రూరల్): ప్రతి పాఠశాలలో కంప్యూటర్ శిక్షణ కేంద్రం, యోగా శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర డిమాండ్ చేశారు. సోమవారం జి.సింగవరం గ్రామంలో అమరవీరులు భగత్‌సింగ్, సుఖ్‌దేవ్ రాజగురు వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రఘువేంద్ర మాట్లాడుతూ.. అమరవీరుల ఆశయ సాధన కోసం పనిచేయడమే వారికిచ్చే నిజమైన నివాళి అన్నారు. గతంలో ప్రతి పాఠశాలలో కంప్యూటర్ టీచర్, యోగా శిక్షకుడు ఉండేవారని, వారిని మళ్లీ నియమించాలని కోరారు. డీవైఎఫ్ఐ నాయకులు విశ్వనాథ్, గోవర్ధన్ పాల్గొన్నారు.

నగరవనం కంచె ఏర్పాటుకు అడ్డంకులు

- సంబంధం లేని టీడీపీ నేత అనుచరుడి బెదిరింపులు


అడవి చుట్టూ కంచె ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్/రూరల్: కర్నూలు నగరవనం పరిరక్షణకు అటవీ శాఖ అధికారులు కంచెను ఏర్పాటు చేస్తున్నారు. వారి సరిహద్దులకు అనుగుణంగా కంచెను ఏర్పాటు చేస్తుండగా దాంతో ఎలాంటి సంబంధం లేని కోడుమూరు ప్రజాప్రతినిధి, అదే నియోజకవర్గ టీడీపీ ముఖ్య నేత అనుచరుడిగా చెప్పుకుంటున్న మిలటరీ కాలనీకి చెందిన వ్యక్తి అడ్డుకున్నారు. కంచె వేస్తున్న కూలీలను బెదిరించి అక్కడినుంచి పంపించేశారు. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు అక్కడి చేరుకొని కంచె ఏర్పాటు పనులను తిరిగి ప్రారంభించారు. ఘటనపై పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయగా వారు సదరు టీడీపీ నాయకునికే అనుకూలంగా మాట్లాడుతున్నట్లు అటవీ శాఖ ఉద్యోగులు పేర్కొంటున్నారు. గతంలో సైతం ఇతను అటవీ శాఖ సరిహద్దుల్లో రోడ్డు వేసుకుంటుండగా అడ్డుపడి పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. సదరు టీడీపీ నాయకుడు అటవీ శాఖ సరిహద్దులో పొలాలు ఉన్న రైతుల వద్దకు వెళ్లి అడవి చుట్టూ కంచె ఏర్పాటు చేస్తున్నారని, అడ్డుకోవాలని రెచ్చగొట్టారు. అయితే కంచె ఏర్పాటుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని రైతులు లిఖితపూర్వంగా అటవీ శాఖ అధికారులకు తెలియజేశారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలో విద్యుత్ శాఖకు సంబంధించి పలు అభివృద్ధి పనులు జరుగుతున్నందున ఈ నెల 25న వివిధ ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. బి.రోడ్ సెక్షన్ పరిధిలోని చల్లావారి వీధి, మహావీర్‌నగర్, ఆర్టీసీ బస్టాండు, శ్రీనివాస కాంప్లెక్స్, త్రిగుణ హోటల్, ఓల్డ్ కల్లూరు రోడ్, తిలక్ నగర్‌లలో ఉదయం 8 గంటల నుంచి, సంతోష్‌నగర్ సెక్షన్ పరిధిలో వెంకటరమణ కాలనీ, రామలింగేశ్వరనగర్, అమీన్ అబ్బాస్‌నగర్, లక్ష్మణ్‌సింగ్ కాలనీలలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ కోతలు ఉంటాయని తెలిపారు.

బాధితుడికి ఆర్థిక సాయం

కర్నూలు: ఏపీడబ్ల్యూజేఎఫ్ నగర ఉపాధ్యక్షుడు మణిబాబు నాలుగు రోజుల క్రితం గుండె సంబంధిత వ్యాధితో ప్రభుత్వాసుపత్రిలో చేరారు. వైద్యులు ఆయనకు పరీక్షలు చేసి స్టంట్ వేశారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు ఈ విషయం తెలుసుకుని మణిబాబు ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాబుకు, ఆయన కుటుంబానికి ధైర్యం చెప్పి ఫెడరేషన్ తరపున కొంత ఆర్థిక సాయం అందించారు. ఆ సంఘం రాష్ట్ర నాయకులు మద్దిలేటి, కేబీ శ్రీనివాసులు, జిల్లా కన్వీనర్ నాగేంద్ర, బ్రహ్మయ్య, ఎర్రమల, పరశురాం, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రంజాన్ మాసంలో దానధర్మాలకు ప్రాధాన్యత


పారిశుద్ధ్య కార్మికులకు చీరలను పంపిణీ చేస్తున్న నజీర్‌హుసేన్, డాక్టర్ భాస్కర్‌రెడ్డి

కర్నూలు(అర్బన్): పవిత్ర రంజాన్ మాసంలో కుల మతాలకు అతీతంగా పేదలకు చేతనైన సహాయం చేస్తే అల్లా కరుణ ఉంటుందని మిలాద్ జిల్లా కమిటీ సభ్యుడు నజీర్‌హుసేన్ తెలిపారు. ఆయన సోమవారం నగరంలోని ధర్మపేట ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో నిర్వహించిన కార్యక్రమంలో వంద మంది పారిశుద్ధ్య కార్మికులకు హోమియో వైద్యుడు భాస్కర్‌రెడ్డి చేతుల మీదుగా చీరలను పంపిణీ చేశారు. రంజాన్ మాసంలో ముస్లింలు తమకున్న దాంట్లో కొంత భాగాన్ని దాన ధర్మాలు చేయాలని పిలుపునిచ్చారు.

రైస్‌మిల్ కార్మికులకు పరిహారం


చెక్కులను అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు(సెంట్రల్): సీఐటీయూ కృషితో 24 మంది రైస్‌మిల్ కార్మికులకు రూ.13 లక్షల పరిహారం మంజూరైనట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు డి.గౌస్‌దేశాయ్ తెలిపారు. కర్నూలు నగరంలోని శ్రీరామచంద్రయ్య (టోపీ రామయ్య) రైస్ మిల్ ఇటీవల లాకౌట్ అయ్యింది. అందులో పనిచేస్తున్న కార్మికులకు బకాయిలు ఒక్కొక్కరికి రూ.52 వేలు చొప్పున యజమాని పరమేశయ్య సోమవారం సీపీఎం కార్యాలయంలో చెక్కులను అందజేశారు.

మునిసిపల్ కార్యాలయం ముట్టడికి పిలుపు


ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మార్చి 26వ తేదీన చేపట్టే మునిసిపల్ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని సీపీఎం న్యూసిటీ, ఓల్డ్‌సిటీ కమిటీల కార్యదర్శులు టి.రాముడు, ఎం.రాజ శేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం ఓల్డ్‌సిటీ కమిటీ ఆధ్వర్యంలో ఓల్డ్‌సిటీలో, న్యూసిటీ కమిటీ ఆధ్వర్యంలో ప్రేమ్‌నగర్‌లో ప్రజా చైతన్య యాత్రలను నిర్వహించారు. ఆయా కాలనీల్లో సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



ధర్నా చేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): విద్యుత్ శాఖలో పని చేస్తున్న మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను తీసుకొచ్చి మీటర్ రీడింగ్ ఉద్యోగులను సాగనంపే ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రభుత్వం నిర్ణయంతో సుమారు 4 వేల మంది ఉపాధికి దూరమవుతారన్నారు. వీరికి శాఖలోనే ప్రత్యామ్నాయం చూపిన తరువాతే స్మార్ట్ మీటర్లను అమలుచేయాలని డిమాండ్ చేశారు.

బిజినెస్ క్విజ్‌లో ప్రతిభ


ప్రతిభ చాటిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, హెచ్‌ఓడీ నాగ గణేష్

కర్నూలు సిటీ: ఎస్‌పీఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో నేషనల్ మేనేజ్‌మెంట్ మీట్ కార్యక్రమాన్ని ఈ నెల 21, 22వ తేదీల్లో నిర్వహించారు. ఇందులో పాల్గొన్న జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన ఫస్ట్ ఇయర్ విద్యార్థులు బిజినెస్ క్విజ్ విభాగంలో మొదటి బహుమతి గెలుపొందారు. ఈ సందర్భంగా సోమవారం ఆ కాలేజీలో జరిగిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సి.శ్రీనివాసరావు, ఎంబీఏ విభాగాధిపతి సి.నాగ గణేష్ బహుమతి పొందిన విద్యార్థినులు అంబిక, శర్వాణిలను వారు అభినందించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.